క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ధర్నా చేపడుతున్న సీపీఎం, వ్యకాస నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణకు అందజేశారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు గౌరి, వ్యకాస నాయకులు నరేందర్, లక్ష్మణ్, బాలయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌పంపు మరమ్మతులో జాగ్రత్తలు తీసుకోవాలి



శిక్షణ ఇస్తున్న ఏఈ అన్వేష్

కౌడిపల్లి(నర్సాపూర్): రక్షిత మంచినీటి పథకంలో భాగంగా హ్యాండ్ పంప్ మరమ్మతులు చేసే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి రైతువేదికలో రెండో రోజు వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాలు, తండాల్లో హ్యాండ్ పంప్‌లు చాలా తక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ హ్యాండ్‌పంప్ పనిచేసే విధానం, ఉపయోగాలు తెలిసి ఉండాలన్నారు. ప్రజలకు తాగునీరు కలుషితం లేకుండా అందించాలన్నారు. నీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే సరిచేయాలని చెప్పారు.

ప్రపంచంలో స్నేహ బంధానికి ప్రత్యేక గుర్తింపు



మాట్లాడుతున్న యజ్ఞానందస్వామి

చేగుంట(తూప్రాన్): రామాయణ కాలం నుంచే స్నేహబంధానికి ప్రత్యేక గుర్తింపు ఉందని యజ్ఞానంద స్వామి అన్నారు. మండలంలోని చందాయిపేట గ్రామంలో వీరాంజనేయ దేవాలయ వార్షికోత్సవాల్లో రెండో రోజు పూజల్లో స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామాయణ కాలంలో రామ భక్తుడిగా గొప్ప గుర్తింపు తెచ్చుకున్న హనుమంతుడి చరిత్ర ఎన్నో గొప్ప విషయాలను తెలియజేస్తుందన్నారు. రెండో రోజు పూజల్లో దేవత ఆవాహణ, ప్రదోషకాల పూజ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తపస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఝాన్సీ



భద్రయ్య

వెల్దుర్తి(తూప్రాన్): తపస్ మాసాయిపేట మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ఝాన్సీ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా మహాలక్ష్మి, కోశాధికారిగా మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తపస్ నాయకుడు రంగారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలపై నూతన కమిటీ పోరాటం చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో శిక్షణ

దుబ్బాకటౌన్: యువతలో శిక్షణ నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ఐటీఐలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందజేస్తున్నామని దుబ్బాక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టాటా టెక్నాలజీ సహకారంతో ఐదు ట్రేడ్‌లలో శిక్షణ అందజేస్తున్నామని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో కుక్కునూర్‌పల్లి ఐటీఐకి హాజరు కావాలని, 19వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



రామాయంపేట(మెదక్): అక్కన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



అల్లాదుర్గం(మెదక్): పెద్దాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): రైతుల కష్టం దళారుల పాలు కావద్దనే ఉద్దేశ్యంతో ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని శానాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అవసరమైనన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో దళారులకు తమ ధాన్యాన్ని విక్రయించొద్దని సూచించారు. సన్నాలకు మద్దతుగా ప్రత్యేక ధర ఇస్తారని తెలిపారు. నిబంధనలకనుగుణంగా ధాన్యం తేవాలని తెలిపారు. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చందన, ప్రశాంత్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీపీఎం మోహన్, డీఎం సివిల్ సప్లయిస్ హరికృష్ణ, డీఎస్‌ఓ సురేష్ రెడ్డి, వెలుగు ఏపీఎం సాయిలు, కొత్తపల్లి ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ త్యార్ల రమేశ్, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు గౌస్, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన ఎర్రం రాములుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఎల్‌ఓసీ అందజేశారు. అక్కన్నపేట గ్రామంలో ఎమ్మెల్యే రూ. 1.90 లక్షలకు సంబంధించి ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు కంబంపాటి విష్ణవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహించండి

రామాయంపేట(మెదక్): గ్రామాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచించారు. మండలంలోని అక్కన్నపేటలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం రైతుల శ్రేయస్సు గురించి ఎంత మాత్రం పట్టించుకోలేదని, రైతులు ధర్నా చేస్తేగాని కేంద్రాలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 473 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. సన్నరకం ధాన్యానికి రూ. ఐదు వందలు బోనస్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ శ్రీనివాస్, సివిల్‌సప్లై జిల్లా అధికారి హరికృష్ణ, తహసీల్దార్ రజనికుమారి, ఏపీఎం రాములు, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గడిపెద్దాపూర్‌లో..

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడిపెద్దపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ మల్లయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకర్ ప్రారంభించారు. నాణ్యత గల వడ్లను తెచ్చినట్లయితే మీకు కనీస మద్దతు ధర క్వింటాలకు రూ.2320 చెల్లించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, సీసీ అబెడ్, ఏఈఓ నవీన్, పిటీసీ సిద్దేశ్వర్, సీఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



కమలాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమలాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల ఇబ్బందులు దూరం చేస్తున్నామని, రైతుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గోపాల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, కుంట్ల రాములు, కుంట్ల శ్రీనివాస్, సంగమేశ్వర్, పెరుమాల్ గౌడ్, రాజేశ్వర్‌రావు, కుంట్ల సంగయ్య, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఫీజు రీయింబర్స్‌మెంట్’ విడుదల చేయండి

● విద్యార్థుల నిరసన



రామాయంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్నేహా, ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాలల విద్యార్థులు తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రెండు కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్స్ రవి, కరుణాకర్, అధ్యాపకులు దేవేందర్, ప్రవీణ్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్‌తో పాటు పాల్గొన్నారు.

భూమికి భూమి ఇవ్వాలి



నర్సాపూర్ ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న రెండు గ్రామాల రైతులు

నర్సాపూర్: భూమికి భూమి ఇవ్వాలి లేదా ఎకరానికి రూ.రెండు కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న మండలంలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు జనార్దన్, శేఖయ్య, యాదయ్య, లక్ష్మి తదితరులు బుధవారం ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డిని కలిసి తమ గోడును వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో భూములు ఎకరానికి రూ.మూడు కోట్ల ధర పలుకుతున్నందున రోడ్డు కోసం తీసుకుంటున్న భూమికి భూమి ఇప్పించాలని, లేనిపక్షంలో ఎకరానికి రూ.రెండు కోట్ల పరిహారం ఇప్పించాలని కోరారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ.. రైతుల ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని వారికి నచ్చ చెప్పారు. ఇప్పటికే రోడ్డు కోసం 16 గ్రామాల అవార్డు ప్రక్రియ పూర్తి అయిందని వారికి వివరిస్తూ రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాల రైతులు తమతో సహకరించాలని ఆయన కోరారు.

సమీకృత మార్కెట్ సముదాయంలోకి దుకాణాలు

సాక్షి ఎఫెక్ట్..



మార్కెట్ సముదాయంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో ప్రారంభోత్సవం ఎప్పుడో శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. అంగడి రోజు దుకాణాలను సమీకృత మార్కెట్ కార్యాలయంలోకి తరలించారు. ఇన్నాళ్లు బోసిపోయిన మార్కెట్ సముదాయం కళ కళలాడింది. రోడ్డుపై రద్దీ తగ్గింది. మొదలే ఇరుకైన రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ కాల్వతో వాహనదారులు, జనాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మార్కెట్ తరలింపుతో రోడ్డుపై రద్దీ తగ్గింది. వాహన దారుల ఇక్కట్లు కనుమరుగయ్యాయి. అంగడి జనాలు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో గురువారం ఉదయం 11 గంటలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఇందిరాక్రాంతి పథం ఏపీఎం సంగీత బుధవారం తెలిపారు.

గోకుల్ కాలనీవాసుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గోకుల్ కాలనీవాసులు

నర్సాపూర్ రూరల్: మా కాలనీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎలాంటి అనుమతులు లేని దుకాణాలకు విద్యుత్ సరఫరా చేస్తే సహించేది లేదంటూ బుధవారం సాయంత్రం నర్సాపూర్ పట్టణంలోని గోకుల్ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడ్డ గోకుల్ కాలనీవాసులంతా సొంత డబ్బులతో నాణ్యమైన కరెంట్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే కాలనీలో అనేక కొత్త ఇళ్లు నిర్మాణం కావడంతో నిత్యం ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. నర్సాపూర్ – మెదక్ రహదారి పక్కన కొత్తగా డబ్బాలతో ఏర్పాటు చేసిన దుకాణాలకు ఫుట్‌పాత్‌పై స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ వివరణ కోరగా.. పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీవాసులు భిక్షపతి, దేవేందర్ యాదవ్, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సుడిదోమ నివారణకు చర్యలు చేపట్టాలి



నర్సంపల్లిలో వరి పంటలో సుడిదోమను పరిశీలిస్తున్న ఏఈఓ విజృంభణ

చిన్నశంకరంపేట(మెదక్): వరి పంటలకు పట్టిన సుడిదోమ నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని నార్సింగి ఏఈఓ విజృంభణ సూచించారు. బుధవారం నార్సింగి మండలం నర్సంపల్లిలో వరి పంటలను పరిశీలించి సుడిదోమను గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందుగా వరి పాయలుగా విడదీసి, దూరం జరపాలన్నారు. అవసరమైన రసాయన మందులు పిచికారీ చేయాలని తెలిపారు. సుడిదోమ మొదటి దశలో ఉన్నట్‌లైతే ఎస్ఫేట్ ఎసిపేట్ 75, ఎస్పీ 1.5 గ్రాములు లేదా ఇథిపెన్‌ప్రాక్స్ 2.0 మీ. లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. సుడిదోమ ఉధృతి అధికమైనప్పుడు డైనోటిఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదా బ్యు ప్రోఫిజన్ 1.6 లీ లేదా పై మెట్రోజన్ 0.60 గ్రాములు లీటరు నీటితో పిచికారీ చేయాలి. మరింత సమాచారం కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. పంటకు సుడిదోమ కన్పించినట్‌లైతే వెంటనే ఏఈఓల సూచనలు తీసుకొని పంటలను కాపాడుకోవాలని వివరించారు.

నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్ ఎస్సీ వాడలో బుధవారం నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితుడు దత్త రామశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, యంత్ర పూజ, విగ్రహ ప్రతిష్ఠతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు



శివ్వంపేట(నర్సాపూర్): పెద్దగొట్టిముక్ల పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



అల్లాదుర్గంలో కొత్తటీచర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంఈఓ ధనుంజయగౌడ్



పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న ఎంఈఓ వెంకటేశం



రేగోడ్(మెదక్): విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



టేక్మాల్‌లో నియామక పత్రాలు అందుకుంటున్న కొత్త టీచర్లు



మండల వనరుల కేంద్రంలో కొత్తగా జాయిన్ అయిన టీచర్లతో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి

నర్సాపూర్: మండలానికి ఆరుగురు ఉపాధ్యాయులు వచ్చారని ఎంఈఓ తారాసింగ్ తెలిపారు. మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారని ఆయన చెప్పారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలానికి 27 ఎస్‌జీటీ, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్‌లుగా నూతన ఉపాధ్యాయులు వచ్చారు. ఎమ్మార్సీ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ వెంకటేశం గ్రామాల వారీగా పోస్టింగ్‌లను కేటాయించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కుమార్, గోపి, ప్రసన్న, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

కొల్చారం(నర్సాపూర్): కొత్తగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారు విధి నిర్వహణలో బాధ్యతయుతంగా వ్యవహరించాలని మండల విద్యాధికారి సత్యనారాయణరావు సూచించారు. కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల్లో 6 మందికి బుధవారం జిల్లా విద్యాధికారి నియామక పత్రాలను అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాల కొల్చారం ముగ్గురు, ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత ఒకరు, పోతంశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఒకరు, రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఒకరు వచ్చారు.

అల్లాదుర్గంకు 21 మంది..

అల్లాదుర్గం(మెదక్): మండలానికి ఎస్‌జీటీ 19 మంది, ఎల్‌పీ 2 కొత్త టీచర్లు వచ్చినట్లు ఎంఈఓ ధనుంజయగౌడ్ తెలిపారు. కొత్తగా వచ్చిన టీచర్లకు బాధ్యత పత్రాలను అందించారు. మండలం నుంచి 7మంది బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. ఇందులో పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు జనార్దన్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. విద్యాశాఖ అధికారులు నియమాక పత్రాలు అందజేశారు. అనంతరం వారు ఆయా పాఠశాలల్లో చేరి విద్యార్థులకు బోధన చేశారు. పెద్దగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విధుల్లో చేరారు.

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఇరవై మంది నూతన ఎస్‌జీటీ ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ఎంఈఓ గురునాథ్ తెలిపారు. కాగా బదిలీ అయిన 29 మంది ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యారని చెప్పారు.

టేక్మాల్‌కు 39మంది..

టేక్మాల్(మెదక్): మండలానికి 39మంది కొత్త టీచర్లు వచ్చినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు. ఎస్‌ఏ 9 మంది, ఎస్జీటీ 26మంది, ఎల్‌పీ 3, స్పెషల్ టీచర్‌గా ఒకరు వచ్చి విధుల్లో చేరారని తెలిపారు. మండలం నుంచి 25 మంది ఎస్జీటీ టీచర్లు బదిలీ అయ్యారని తెలిపారు.

పాపన్నపేట మండలానికి 11 మంది..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం 11 మంది కొత్త టీచర్లు విధుల్లో చేరారు. 2024 డీఎస్సీకి సంబంధించిన వీరు ఈనెల 9న హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు పొందారు. మంగళవారం మెదక్‌లో పాఠశాలలు కేటాయించగా, బుధవారం మండల వనరుల కేంద్రంలో రిపోర్టు చేశారు. మల్లంపేట ఉన్నత పాఠశాలకు ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, అన్నారంకు ఒక్క స్కూల్ అసిస్టెంట్, అర్కెల ప్రాథమికోన్నత పాఠశాలకు లాంగ్వేజ్ పండిట్, పాపన్నపేట ఉర్దూ మీడియం, సోమ్లాతండా, అమ్రియా తండా, కొత్త లింగాయపల్లి, మొదల్లకుంట, పొడిచన్‌పల్లి పాఠశాలలకు ఎస్జీటీ టీచర్లు అలాట్ అయ్యారు.

కౌడిపల్లికి ఆరుగురు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలానికి నూతనంగా ఆరుగురు ఉపాధ్యాయులు నియామకమైనట్లు ఎంఈఓ బాలరాజు తెలిపారు. దీంతోపాటు కంచన్‌పల్లికి నరేందర్‌రెడ్డి, భుజిరంపేటకు సత్యనారాయణ(సాంఘీకశాస్త్రం), వెల్మకన్నకు సమియొద్దీన్(జీవశాస్త్రం), వసుధ(గణితం), సలాబత్‌పూర్‌కు సర్దార్(గణితం) స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా నియామకం అయినట్లు ఎంఈఓ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

నర్సాపూర్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్‌కి చెందిన రామమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, నాయకులు ఉన్నారు.

◆ **ఓటరు నమోదు చేసుకోవాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. డిగ్రీ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కాన్వొకేషన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఓటర్‌ఐడీ జిరాక్స్ పత్రాలతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని చెప్పారు. గతంలో ఎమ్మెల్సీ ఓటుహక్కు ఉన్నవారు సైతం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **సన్మానం**



నర్సాపూర్: తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల కాలేజీలో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినిని బుధవారం అధికారులు అభినందించి సన్మానించారు. పట్టణంలోని గురుకులంలో చదివిన అమెరుద్దీన్ వికారాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో అతన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి జెంలానాయక్, ప్రాంతీయ స్థాయి సమన్వయాధికారి సుధారాణి, పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ నసీమా, ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలకు బీరువా అందజేత**

గజ్వేల్: లయన్స్ క్లబ్ విజడమ్ ఆధ్వర్యంలో మండలంలోని బంగ్లావెంకటాపూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం బీరువాను అందజేశారు. లయన్ రాధాకృష్ణ తన సతీమణి పద్మజ జన్మదినం సందర్భంగా ఈ బీరువాను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ గోలి సంతోష్‌కుమార్, జోన్ చైర్ పర్సన్‌లు నేతి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, లయన్స్ క్లబ్ విజడమ్ గజ్వేల్ శాఖ అధ్యక్షుడు జూపల్లి సుధాకర్, ప్రతినిధులు సంజయ్‌గుప్త, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: విద్యారంగంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సాహసం(సామాజిక హక్కుల సంఘం) జిల్లా అధ్యక్షుడు కానుగుల రమణాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఐఓసీలో ఆర్డీఓ బన్సీలాల్‌కు బుధవారం ఆయన విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యపై గత ప్రభుత్వం లాగానే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాల తీరుతో విద్యార్థులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.